# పెరుగుతున్న జొన్న సాగు



తిరుమలగిరిలో సాగు చేస్తున్న జొన్న పంట

- పెట్టుబడి తక్కువ
- ఆదాయం ఎక్కువ
- ఆహారంగా పెరిగిన ప్రజల వినియోగం
- సాగుకు మొగ్గు చూపుతున్న రైతులు
- నియోజక వర్గ వ్యాప్తంగా 135 ఎకరాల్లో సాగు

తిరుమలగిరి, డిసెంబర్ 3 : చిరు ధాన్యాలు అనాదిగా మన ఆహారంలో భాగమై ప్రముఖ పాత్ర పోషించాయి. అందులో జొన్న ధాన్యానికి ప్రత్యేక స్థానం ఉన్నది. అయితే ప్రస్తుత ఆధునిక కాలంలో పాల పదార్థాలు, చక్కెర, బియ్యం, గోధుమలు, జంక్‌ఫుడ్స్ తదితరాలు మన ఆహారంలో భాగం కావడంతో వాటి వల్ల మనం ఎన్నో రోగాల భారిన పడుతున్నాం. దాంతో ప్రజలు రోగాల భారిన పడకుండా, అనారోగ్యాలు పెరుగకుండా ఉండేందుకు క్రమంగా చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో జొన్నను ఆహారంలో భాగం చేసుకుంటున్నారు. జొన్న ధాన్యంలో మన శరీరానికి అవసరమైన ప్రొటీన్స్, ఇనుము, కాల్షియం, విటమిన్ బి, ఫోలిక్ ఆమ్లం వంటి సూక్ష్మ పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. దాంతో జొన్న రొట్టె, వివిధ రకాల జొన్న ఉత్పత్తులకు ప్రజల నుంచి డిమాండ్ పెరుగుతుండడంతో రైతులు జొన్న పంటను సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. జొన్న చొప్పకు కూడా పశుగ్రాసంగా మంచి డిమాండ్ ఉన్నది. క్వింటా జొన్నలకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2,858 ప్రకటించింది. మద్దతు ధరకంటే ఎక్కువకే రూ.4 వేలకు వ్యాపారులు జొన్నలను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం. నియోజక వర్గ వ్యాప్తంగా 135 ఎకరాలకు పైగా ప్రస్తుతం జొన్న పంటను సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ఆవాస గిరిజన పంచాయతీలు, తండాల్లో జొన్న సాగు ప్రతి ఏడాది పెరుగుతున్నది. నియోజక వర్గం వ్యాప్తంగా 50కి పైగా జొన్న రొట్టె విక్రయ కేంద్రాలు ఉన్నాయి. చాలా మంది రాత్రివేళలో జొన్న రొట్టెలు, జొన్న అన్నం తినడం అలవాటుగా మార్చుకుంటున్నారు.

### తక్కువ పెట్టుబడి..

జొన్న సాగుకు పెట్టుబడి తక్కువ. ఆదాయం బాగానే ఉంటుంది. విత్తనాలు, దున్నడం తప్పా మరే ఇతర పెట్టుబడి ఉండదు. ఎరువుల వాడకం ఉండదు. ఎకరానికి కిలో విత్తనాలు, దుక్కి దున్ని విత్తనాలు వేయడానికి రూ.2 వేలు అవుతుంది. ఎకరాకు దిగుబడి 8 నుంచి 10 క్వింటాళ్లు వస్తుంది. అంటే 20 వేల రూపాయలు వరకు ఆదాయం వస్తుంది.

> **పూర్తి ఆర్గానిక్ పంట**
>
> ఈ రోజుల్లో అన్ని పంటలకు పై మందుల పిచికారి, ఎరువులు వాడుతున్నారు. కానీ జొన్న సాగు పూర్తిగా ఆర్గానిక్ పంట. ఎలాంటి రసాయన ఎరువుల వాడకం ఉండదు. అందుకే రోగాల భారినుంచి ఉపశమనం పొందవచ్చేనేది కూడా ప్రజల ఆలోచనగా ఉంటుంది. నవంబర్‌లో జొన్న సాగు చేస్తే సంక్రాంతి పండుగ వరకు పంట చేతికి వస్తుంది.

### పశువులకు మేతగా సొప్ప..

జొన్న సొప్ప పశువులకు మంచి మేతగాను ఉపయోగపడుతున్నది. ఎకరం జొన్న చేను సొప్ప విక్రయిస్తే రూ.5 వేలకు పైగానే ఆదాయం వస్తున్నది. అరక ఉన్న రైతులకు పెట్టుబడి ఉండదు. యంత్రాలతో దున్ని సాగుచేసిన సొప్పుతో పెట్టుబడి ఖర్చులు తీరుతాయి.

### ఊళ్లోనే పంట అమ్మకం



నాకు ఉన్న రెండు ఎకరాల్లో యాసంగిలో ఎకరం పొలంలో జొన్న సాగు చేశా. పంట చేను బాగానే ఉంది. వరికి బదులు ఏ పెట్టుబడి లేకుండా హాయిగా జొన్నలు వేసుకొన్నా. 20 రోజులైతే పంట చేతికి వస్తుంది. ఇంటి మందం తినడానికి ఉంచుకుని మిగిలినవి అమ్ముకుంటాం. మా తండాలోనే కొనడానికి తయారుగా ఉన్నరు. బయటకు పోయి అమ్మే అవసరం కూడా లేదు. జొన్న సొప్ప పశువులకు మేతైతది. జొన్నలకు మంచిగా గిరాకి ఉంది.

– కమిలిబాయి, మహిళా రైతు, నీలిబండతండా, తిరుమలగిరి.

### జొన్న ఆహారంతో రోగ నిరోధక శక్తి పెంపు



జొన్నలను ఆహారంగా తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. మనం నిత్యం తినే ఆహార పదార్థాల్లో పీచు పదార్థాలు లేకపోవడం వల్ల వివిధ రోగల భారిన పడుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ఎలాంటి మందులు వాడకుండా పండించే జొన్నలను ఆహారంలో భాగం చేసుకుంటే ఆరోగ్యరీత్యా అన్ని రకాలుగా శ్రేయస్కరం.

– బిచ్యానాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, తిరుమలగిరి.

# శ్రీకాంతాచారికి నివాళి

మోత్కూర్, డిసెంబర్ 3 : తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 14వ వర్ధంతిని మండలంలోని పొడిచేడులో ఆదివారం నిర్వహించారు. శ్రీకాంతాచారి తల్లిదండ్రులు శంకరమ్మ-వెంకటాచారి, బీఆర్ఎస్ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తన కొడుకు శ్రీకాంతాచారి త్యాగం వృథా పోలేదని, అమరుల ఆశయాల సాధన కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కప్పె వెంకటేశం, బీఆర్ఎస్ నాయకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## భగవద్గీతపై ఇంటింటి ప్రచారం





రామ్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

మోత్కూర్, డిసెంబర్ 3 : త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రబోధ సేవా సమితి ప్రతినిధులు ఆదివారం మండలంలోని ముశిపట్ల పరిధి రామ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి భువనగిరి, జనగామ, తొర్రూరు కమిటీ ప్రతినిధులు దేవేంద్ర, లక్ష్మీనారాయణ, శంకర్, లింగస్వామి, నరేశ్, లత, కవిత, సౌమ్య, రాణి పాల్గొన్నారు.



నాగారంలో బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

# బీఆర్ఎస్ నాయకుల సంబురాలు

నాగారం, డిసెంబర్ 3 : హ్యాట్రిక్ సాధించిన సూర్యాపేట అభివృద్ధి ప్రదాత, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విజయోత్సవ సంబురాలను నాగారం మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మిఠాయిలు పంచి పటాకులు కాల్చి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి కో-ఆర్డినేటర్ గుండగాని అంబయ్య, కన్నెబోయిన మల్లేశ్, కుంభం కరుణాకర్, మధున్‌రెడ్డి, బెల్లి నరేశ్, శ్రవణ్, భాను, రాములు, భద్రయ్య, శ్రీకాంత్, సురేశ్, యాదగిరి, తరాల అంజి, సైదులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు

- దాదాపు పూర్తయిన ధాన్యం కొనుగోళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

మునుగోడు/కొండమల్లేపల్లి, డిసెంబర్ 3 : ఆరు గాలం కష్టపడి పండించిన ధాన్యం డబ్బులు చేతికి వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల హడావిడిలో ఉన్నప్పటికీ అధికారులు ధాన్యం సేకరణపై కూడా దృష్టిసారించారు. దాంతో మండలంలో కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతుండగా.. ధాన్యం డబ్బులు సైతం పది రోజుల్లోపే రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయి.



కచలాపురంలో ధాన్యం లోడ్ చేస్తున్న హమాలీలు

### 1,824 మంది రైతుల నుంచి సేకరణ

మునుగోడు మండలంలోని కచలాపురం, మునుగోడు, ఊకొండి, గూడపూర్, కొరటికల్, కల్వలపల్లి, బీరెల్లిగూడెం, పులిపలుపుల, పలివెల, కొంపెల్లి, సింగారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో అధికారులు నిత్యం పర్యవేక్షణ చేస్తూ ధాన్యం సేకరణ చేపట్టారు. ప్రస్తుతం ధాన్యం సేకరణ దాదాపు పూర్తయింది. పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 1,824 మంది రైతుల నుంచి 83,913 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 714 మంది రైతుల నుంచి 32,205 క్వింటాళ్లు, ఐకేపీ ఆధ్వర్యంలో 1010 మంది రైతుల నుంచి 51,785 క్వింటాళ్లు సేకరించారు. సేకరించిన ధాన్యానికి సంబంధించి దాదాపు సగం మంది రైతుల ఖాతాల్లో ఇప్పటికే డబ్బులు జమ అయ్యాయి.

### కొండమల్లేపల్లిలో 21,915 క్వింటాళ్లు

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో గుమ్మడవెల్లి, పెండ్లిపాకల, చిన్న అడిశర్లపల్లి, కొండమల్లేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో ఇప్పటి వరకు 357 మంది రైతుల నుంచి 54,787 బస్తాలు (21,915 క్వింటాళ్లు) ధాన్యం కొనుగోలు చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సంబంధించిన ధాన్యం కొనుగోలు చేసి డబ్బులను వారం రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నారు. దాంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొండమల్లేపల్లి కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం

### దళారుల బెడద తప్పింది



ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుండడంతో దళారుల బెడద తప్పింది. నేను దాదాపు 38 క్వింటాళ్ల ధాన్యం తీసుకొచ్చి కొనుగోలు కేంద్రంలో అమ్మిన. రూ.80 వేలకు పైగా డబ్బులు వచ్చాయి. ధాన్యం అమ్మిన వారం లోపే డబ్బులు ఖాతాలో పడ్డాయి. రైతులు ఇబ్బందులు పడొద్దని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

–బీసం మల్లేశ్, రైతు, మునుగోడు

### ధాన్యం సేకరణ పూర్తికావచ్చింది



మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాం. రైతుల నుంచి ధాన్యం తీసుకున్న వెంటనే వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. రైతుల ఖాతాల్లోకి వారం పదిరోజుల్లోపే డబ్బులు జమ అవుతున్నాయి. గన్నీ సంచుల కొరత లేకుండా ముందుగానే జాగ్రత్తలు తీసుకున్నాం. ధాన్యం సేకరణ దాదాపు పూర్తి కావచ్చింది.

–పాలకూరి సుఖేందర్‌గౌడ్, సహకార సంఘం సీఈఓ, మునుగోడు